మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

సోమవారం12-10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 311

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## అట్టుడికిన హస్తిన

### ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఢిల్లీలో వరుసగా రెండో రోజూ కొనసాగాయి. జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోగా, భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. అరెస్టులు, ఆంక్షలతో ఉద్యమాన్ని అణచలేరని, డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాడతామని సీజేపీ నేత అజింక్య శిండే స్పష్టం చేశారు. మరోవైపు, ముంబైలోని శివాజీ పార్కుకు ఆందోళనలను విస్తరించేందుకు సన్నాహాలు జరుగుతుండగా, ఇండియా కూటమి నేతలు కూడా నిరసనలకు సిద్ధమవుతున్నారు. సీజేపీ నేతలతో సమావేశానికి రాహుల్ గాంధీ సమయం కోరినట్లు సమాచారం.

03

- జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు
- రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే
- జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు
- భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ
- ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు
- నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు
- సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ
- యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్



03

## విండీస్‌పై భారత్ విక్టరీ

- సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20
- మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం
- అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు
- ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు
- 223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు
- 209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్
- అర్షదీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా
- చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా
- అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20



## బీసీల ద్వేషి జగన్!

- బీసీలకు అండగా నిలిచేది టీడీపీనే
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం
- కక్షలు, కార్పణ్యాలు, దాడులకే ప్రాధాన్యం
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కృషి
- రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు
- బీసీలకు సముచిత స్థానం కల్పిస్తాం
- మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యలు

రేపల్లె,

బీసీలు టీడీపీకి అనుకూలంగా ఉంటారనే కారణంతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మొదటి నుంచీ వారిపై ద్వేషం పెంచుకున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. బీసీలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా రేపల్లెలో రూ.56 కోట్లతో చేపట్టనున్న విద్యుత్ అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో కక్షలు, కార్పణ్యాలు, దాడులు తప్ప అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి గట్టి బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతల వైఖరిలో మార్పు రాలేదని పార్థసారథి అన్నారు. బీసీలకు 34 శాతం

-మిగతా 3 లో

## డోలీ మోతల్లేని గ్రామాలే లక్ష్యం!

### గిరిజనులు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- సెల్ టవర్లు, రోడ్లు, పాఠశాలలు.. అన్నీ కల్పిస్తాం
- రూ.2,055 కోట్లతో 'అడవితల్లి బాట 2.0'కు శ్రీకారం
- 1,341 ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల రహదారులు
- 45 వంతెనల నిర్మాణానికి ప్రణాళిక
- ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు
- గత వైసీపీ పాలనలో రహదారుల నిర్లక్ష్యం
- 'అడవితల్లి బాట 2.0' సభలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరం,

డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలే తన లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలో దట్టమైన అటవీ ప్రాంతమైన కాకవాడ గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. రాకోట గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి, వారు తయారుచేసిన వెదురుబొంగు వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. వారికి మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం.. రూ.2,055 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 1341 ఆవాసాలకు 1976 కిలోమీటర్ల మేర రోడ్లతో పాటు

-మిగతా 3 లో





03

## రష్యా--ఉక్రెయిన్ మధ్య సీజ్‌ఫైర్!

- ట్రంప్ ప్రకటనతో యుద్ధానికి విరామం?
- తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని వెల్లడి
- ట్రూత్ సోషల్‌లో ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇంధన రంగంపై దాడులు నిలిపివేసేందుకు అంగీకారం
- ఒప్పందాన్ని ఉల్లంఘించొద్దని ఇరు దేశాలకు సూచన
- కాల్పుల విరమణపై తమకు సమాచారం లేదన్న ఉక్రెయిన్ వర్గాలు
- ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా ఉత్కంఠ

## ఏఐ, అణు యుద్ధంతో 2100 నాటికి మానవాళి అంతం

03





## శ్రీశైలంలో ఘనంగా ప్రారంభమైన దసరా మహోత్సవాలు

-శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు.. శైలపుత్రి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలం:

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పది రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. మహోత్సవాల ప్రారంభ సందర్భంగా ముందుగా గణపతి పూజ, శివ సంకల్పం, చండీశ్వరి పూజ, కంకణధారణ, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమంతో పాటు పలు విశేష పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారు వివిధ ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ స్వామి, అమ్మవార్లు శైలపుత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవార్లు భృంగి వాహనంపై ఆసీనులై క్షేత్ర పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దసరా మహోత్సవాల నేపథ్యంలో శ్రీశైల క్షేత్రం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడుతోంది.

## రొటేషన్‌లో రిజర్వేషన్ల నిర్ధారణ నేడే!

### పట్టణాలు, నగరాల్లో ఎన్నికల ఉత్కంఠ



- తొలుత ఎస్టీలకు రిజర్వేషన్ల కేటాయింపు
- ఆ తర్వాత ఎస్సీలు, బీసీలు, ఓసీలు, మహిళలకు వరుస క్రమంలో
- మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల స్థానాలపై ఆసక్తి
- కొత్త వార్డులు, డివిజన్లకు కొత్తగా రిజర్వేషన్లు
- ముందుగా మున్సిపల్ ఎన్నికలు.. తర్వాత పరిషత్‌లు, పంచాయతీలు
- రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకున్న స్థానిక ఎన్నికల సందడి

అమరావతి,

'స్థానిక' శంఖారావంతో పట్టణాలు, గ్రామాల్లో ఎన్నికల కోలాహం మొదలైంది. ముందుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రక్రియ ఊపందుకుంది. రిజర్వేషన్ల నిర్ధారణకు పురపాలక శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం వాటిని ఖరారు చేయనున్నారు. దీంతో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, మున్సిపల్ చైర్‌పర్సన్, కార్పొరేషన్ మేయర్ దాకా ఏ స్థానిక సంస్థలో ఏ కేటగిరీకి రిజర్వు

-మిగతా 3 లో



03

## నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం!

### నేలమట్టమైన ఇళ్లు, బ్రిడ్జిలు..!

- గోర్ఖా జిల్లాలో అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద
- వరద ఉధృతికి 34 ఇళ్లు, పలు వంతెనలు ధ్వంసం
- రెండు గంటల్లో 3.66 నుంచి 8.43 మీటర్లకు పెరిగిన నీటిమట్టం
- తీవ్రంగా దెబ్బతిన్న జలవిద్యుత్ కేంద్రం
- ప్రాణనష్టం లేదన్న విపత్తు నిర్వహణ సంస్థ
- రంగంలోకి దిగిన నేపాల్ సైన్యం.. సహాయక చర్యలు ముమ్మరం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

# ప్రభుత్వం మారినా రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..



**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
తమిళనాడులో ప్రభుత్వం మారినప్పటికీ ఆ రాష్ట్రంపై తన నిబద్ధత మారదని ప్రధాని మోదీ అన్నారు. అంతేకాదు.. తమిళనాడు సీఎం విజయ్‌తో కలిసి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం అన్నారు. చెన్నైలో పూనమల్లి-వడపళని మార్గంలోని మెట్రో రైలును సీఎం విజయ్‌తో కలిసి ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో రూ.13,000 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధాని ప్రసంగం చేశారు.‘ఈరోజు తమిళనాడు చరిత్రలో చారిత్రాత్మక రోజు. రవాణా, పరిశ్రమలు, వ్యాపారం, నిర్మాణం వంటి రంగాల్లో రూ.13,000 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించాం. కొన్ని పనులను ప్రారంభించగా.. ఇంకొన్నింటికి శంకుస్థాపనలు చేశాం. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు తమిళనాడు యువతకు పలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడి సీఎంలు కరుణానిధి, జయలలిత వంటి వారితో కలిసి పని చేశా. అలాగే, ప్రధానిగా ఉన్న సమయంలో జయలలిత, పన్నీర్ సెల్వం, పళనిస్వామి, ఎంకే స్టాలిన్‌లతో కూడా పని చేశా. ప్రభుత్వాలు మారాయి. కానీ, తమిళనాడు అభివృద్ధి, ఇక్కడి ప్రజలకు సేవ చేసే విషయంలో నా దృక్పథం మాత్రం మారలేదు. నేను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వారి ఆలోచనలు, ఆకాంక్షలు ఎలా ఉంటాయో ఆలోచించా. అందుకే ప్రధాని అయిన తర్వాత వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నా. ప్రతి రాష్ట్రం తమ సొంత లక్ష్యాలను సాధించుకోవాలి” అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం విజయ్‌తోపాటు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కూడా పాల్గొన్నారు. మెట్రో రైలులో ప్రయాణించిన సందర్భంగా మోదీ రైలు టిక్కెట్ కొనుగోలు చేయడం విశేషం.

# అమెరికాను అతలాకుతలం చేసిన హరికేన్ ఇసైయాస్..

**-టోర్నడో ముప్పు ఉందని హెచ్చరిక..!**



**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
అగ్రరాజ్యం అమెరికా దక్షిణ ప్రాంతాన్ని ‘ఇసైయాస్ ’ హరికేన్ అతలాకుతలం చేసింది. తుఫాను కారణంగా వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఫ్లోరిడా, అలబామా, జార్జియా, మిస్సిసిపి రాష్ట్రాల్లో దాదాపు 6.7 లక్షల మంది నివాసితులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.తుఫాను బలహీనపడినప్పటికీ ఈదురుగాలులు, ఆకస్మిక వరదలు, టోర్నడో ముప్పు పొంచి ఉందని నేషనల్ హరికేన్ సెంటర్ హెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలో ‘రాచెల్’ తుఫాను కారణంగా కాలిఫోర్నియాలోనూ 7,000 మందికి కరెంట్ కోతలు విధించారు. ఫ్లోరిడాలోని డెస్టిన్ సమీపంలో గంటకు సుమారు 105 మైళ్ల వేగంతో వీచే గాలులతో కేటగిరీ 2 హరికేన్‌గా తీరాన్ని తాకిన ఇసైయాస్ అనే ఉష్ణమండలానంతర తుఫాను, శనివారం బర్మింగ్‌హామ్ సమీపంలో మధ్య అలబామా గుండా ఈశాన్య దిశగా కదులుతోంది. ఈ తుఫాను కారణంగా ఇప్పటివరకు కనీసం నలుగురు మరణించారు. అలబామా, ఫ్లోరిడా పాన్‌హ్యాండిల్‌లో చెట్లు, విద్యుత్ తీగలు నేలకూలడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, దాంతో శుక్రవారం రాత్రి రోడ్లను మూసివేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. అలబామా, ఫ్లోరిడా పాన్‌హ్యాండిల్, పశ్చిమ జార్జియాలోని చాలా ప్రాంతాల్లో లక్షలాది ఇళ్లు, వ్యాపార సంస్థలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

# పడవ బోల్తా.. 139 మంది మృతి

**116 మందికి పైగా గల్లంతు.. జిబౌతీలో దారుణం**



**ఒబాక్ న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
ఆఫ్రికాలోని జిబౌతీ సముద్ర జలాల్లో దారుణం జరిగింది. యెమెన్‌కు 350 మంది వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 139 మంది చనిపోగా.. ఇందులో 15 మంది పిల్లలు ఉన్నారు. 116 మందికి పైగా గల్లంతయ్యారు. ఈ ఘటనలో 80 మందికి పైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడ్డట్టు తెలుస్తున్నది. ప్రాణాలతో బయటపడ్డవారు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 8-9తేదీల మధ్య రాత్రి జిబౌతీలోని ఓడరేవు పట్టణమైన ఒబాక్‌కు ఉత్తరాన గుహెరే సమీపంలో ఈ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడిని తీవ్రంగా ఖండించిన భారత్..!

**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
సౌదీఅరేబియా రాజధాని నగరం రియాద్ లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పై జరిగిన క్షిపణి దాడి ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోవడమేగాక 300 మందికిపైగా గాయపడటంపట్ల విచారం వ్యక్తంచేసింది. పౌరులను లక్ష్యంగా చేసుకుని, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని జరిపే ఇలాంటి దాడులు మళ్లీమళ్లీ పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది.గత దశాబ్ద కాలంలో సౌదీగడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా తాజా దాడిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం



కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతోపాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ‘పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి’ అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని విదేశాంగశాఖ తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం.

# ఇంటర్నెట్ ఆపొద్దు.. మెట్రో రైళ్లు నడపండి.

**సీజేపీ నిరసనల వేళ కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన**

**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
సీజేపీ నిరసనల వేళ ఢిల్లీలో పోలీసులు కఠినమైన ఆంక్షల్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు స్పందించింది. బారికేడ్లు తొలగించాలని, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లు యథాతథంగా నడపాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు ఆదివారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో శనివారం పోలీసులు భారీ ఆంక్షలు విధించారు. నిరసన జరిగే జంతర్ మంతర్‌తోపాటు అనేక చోట్ల బారికేడ్లు



ఏర్పాటు చేశారు. ఢిల్లీ పరిధిలోని 50కిపైగా మెట్రో రైలు స్టేషన్లను మూసేసి, రైలు సర్వీసుల్ని నిలిపివేశారు. ఇంటర్నెట్ సేవల్ని రద్దు చేశారు. దీంతో ఢిల్లీలో ఒక నిర్బంధ, ఎమర్జెన్సీ వాతావరణం తలపిస్తోంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని ధర్మాసనం ఆదివారం అత్యవసరంగా విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో ప్రజా జీవితం సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లు ప్రారంభించాలని, బారికేడ్లు తొలగించాలని సూచించింది. ప్రజలను అనవసరంగా, ప్రతి చోటా తనిఖీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. సీజేపీ నిరసన సందర్భంగా అత్యవసరమని భావిస్తే తప్ప ఈ ఆంక్షలు విధించకూడదని సూచించింది. శాంతి భద్రతలకు నిజంగా విఘాతం కలుగుతుందని భావించినప్పుడే ఈ ఆంక్షలు అమలు చేయాలని వివరించింది. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర హోం శాఖ సెక్రెటరీ, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ తీర్పు వెలువడటానికి ముందే సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సహా కీలక నేతల్ని విడుదల చేయాలని మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించి

# పాకిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎమర్జెన్సీ..

**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అనే మాటలకు పెద్దగా విలువుండదు. అక్కడా అంతా నియంతృత్వమే. ఎవరు అధికారంలో ఉంటే వారిదే పెత్తనం. ఇందుకు తాజా పరిణామాలే ఉదాహరణ. పాకిస్తాన్‌లోని కీలక ప్రాంతమైన ఖైబర్ పఖ్తుంఖ్వాలో అక్కడి సమాఖ్య ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. అక్కడ అధికారంలో ఉన్న పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) ప్రభుత్వాన్ని రద్దు చేసింది. రాష్ట్ర సీఎం సోహైల్ అఫ్రిదితోపాటు ఆరుగురు క్యాబినెట్ మంత్రుల్ని అరెస్టు చేసింది.పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలోని సమాఖ్య ప్రభుత్వం దీనిపై ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ రద్దు, ఎమర్జెన్సీ, సీఎం, మంత్రుల అరెస్టు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234ను ప్రభుత్వం ఉపయోగించింది. ఈ నిర్ణయానికి రాష్ట్రపతి అసిఫ్ అలీ జర్దారీ అంగీకారం తెలిపారు. పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైలులో ఉన్న సంగతి



తెలిసిందే. ఆయనను షరీఫ్ ప్రభుత్వం అరెస్టు చేసి, జైలు నుంచి విడుదల కాకుండా చూస్తోంది. దీంతో ఆయన మద్దతుదారులు ఇటీవల ఆందోళన నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం అఫ్రిది ఈ నెల 4న ర్యాలీ నిర్వహించారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలని కోరుతూ ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ర్యాలీ నిర్వహించి ఇబ్బంది కలిగించినందుకుగాను షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించింది. దీంతో ఇప్పుడు అక్కడ శాంతి భద్రతలు, పాలన సహా మొత్తం అధికారం స్థానిక గవర్నర్ పరిధిలో ఉంటుంది. ఈ అంశంపై సీఎం సోహైల్ అఫ్రిది స్పందించారు. తమ ప్రభుత్వాన్ని రద్దు చేసినా, గవర్నర్ పాలన విధించినా తమ డిమాండ్ల విషయంలో వెనుకడుగు వేయబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమాఖ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై . ఖైబర్ పఖ్తుంఖ్వా పరిధిలోని ప్రజలు, మద్దతుదారులు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా . ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్‌లో రోడ్లపై భారీ షిప్పింగ్ కంటైనర్లను అడ్డుగా పెట్టారు. నగరవ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఇస్లామాబాద్‌లోని ప్రధాని నివాసం వద్ద కూడా గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

# పోరాటం ఇప్పుడే మొదలైంది..

**-జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకూ వెనక్కి తగ్గబోం**
**-దేశ రాజధానిలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు**
**-సీఈసీని కాపాడేందుకు సొంత ప్రజలపైనే యుద్ధమా?**
**-కేంద్ర సర్కార్‌పై సీజేపీ ఫైర్**

**న్యూఢిల్లీ :డ్రీమ్ టైమ్స్**
: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలను దేశవ్యాప్తం చేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలు ప్రకటించారు. ఢిల్లీ పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన అనంతరం సీజేపీ సహ కన్వీనర్ ఆశుతోష్ రాంకా, మరో నేత సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ, తమ పోరాటం ఇప్పుడే మొదలైందని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయని, ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని సీజేపీ ఆరోపించింది. ప్రధాని మోదీ ప్రభుత్వం ఢిల్లీలో అత్యవసర పరిస్థితులను తలపించే వాతావరణాన్ని సృష్టించిందని దాస్ విమర్శించారుఎలాంటి అధికారిక నోటీసు లేకుండా



తమను నిర్బంధించారని, తమ ఫోన్లు స్వాధీనం చేసుకుని, న్యాయవాదిని సంప్రదించేందుకు అనుమతించలేదని ఆరోపించారు. తమ ఫోన్లను హ్యాక్ చేసి, వాటిలో పత్రాలు లేదా ఇతర సమాచారాన్ని చొప్పించి, తర్వాత వాటిని సాక్ష్యాలుగా చూపిస్తారేమోనని అనుమానంగా ఉందని దాస్ పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, అమిత్ షా ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ‘గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారు. ఆయన్ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు’ అని వ్యాఖ్యానించారు. ‘శాంతి భద్రతలకు ఏడాది పాటు విఘాతం కలిగించకూడదని తమకు షరతు విధించారు. అయితే శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తున్నది నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లేనని సీజేపీ నేతలు పేర్కొన్నారు. గత 72 గంటల్లో జరిగిన పరిణామాలు 1975-77 నాటి అత్యవసర పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని రాంకా వ్యాఖ్యానించారు. ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని, నిరసనల్లో పాల్గొనేందుకు వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం పార్లమెంట్ వీధి పోలీసులను కలిసి జంతర్ మంతర్‌లో శాంతియుత నిరసన తెలిపేందుకు ఒక తేదీని అనుమతించాలని కోరతా మన్నారు.

# విండీస్‌పై భారత్ విక్టరీ

**సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20**
**-మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం**
**-అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు**
**-ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు**
**-223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు**
**-209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్**
**-అర్షదీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా**
**-చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా**
**-అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20**



వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా అదరగొట్టింది. ఇండోర్ వేదికగా జరిగిన హైస్కోరింగ్ పోరులో 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఈ సిరీస్‌లో నాలుగో టీ20 అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ (69) దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇషాన్ కిషన్ (37) కూడా వేగంగా పరుగులు సాధించడంతో భారత జట్టు భారీ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఒక దశలో 250 పరుగుల మార్కును అందుకునేలా కనిపించిన టీమిండియా.. ఆ తర్వాత వరుస వికెట్లు కోల్పోయి తడబడింది. అయితే చివర్లో తిలక్ వర్మ (28), అక్షర్ పటేల్ (20) కీలక పరుగులు జోడించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. భారీ లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. రెండో ఓవర్లోనే షై హోప్ ఐదు పరుగులు చేసి వెనుదిరిగాడు. అయినప్పటికీ విండీస్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నించారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెరిగింది. అర్షదీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, నమన్ ధీర్ రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ సాధించారు. చివర్లో షమర్ స్ప్రింగర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత శిబిరంలో కొంత ఉత్కంఠ రేపాడు. కేవలం 11 బంతుల్లోనే 35 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే అప్పటికే లక్ష్యం దూరం కావడంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. గత మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్.. ఈసారి భారత బౌలర్లను అధిగమించలేకపోయింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో నిలిచింది. సిరీస్‌ను కైవసం చేసుకోవాలంటే తదుపరి మ్యాచ్‌లోనూ భారత జట్టు ఇదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. మరోవైపు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో వెస్టిండీస్ బరిలోకి దిగనుంది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20కి హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియం వేదిక కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## రష్యా--ఉక్రెయిన్ మధ్య సీజ్‌ఫైర్!



వాషింగ్టన్:
రష్యా--ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. రష్యా, ఉక్రెయిన్ ఇంధన రంగానికి సంబంధించిన దాడులను నిలిపివేసేందుకు అంగీకరించాయని తెలిపారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ, ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని ఇరు దేశాలకు సూచించారు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఉక్రెయిన్ వర్గాలు స్పందిస్తూ.. కాల్పుల విరమణకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నాయి. దీంతో ఈ ప్రకటన అమలుపై సందిగ్ధత నెలకొంది. ఇరు దేశాల మధ్య నిజంగానే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందా? రష్యా, ఉక్రెయిన్ అధికారికంగా ఎలా స్పందిస్తాయి? అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఏఐ, అణు యుద్ధంతో 2100 నాటికి మానవాళి అంతం!



న్యూఢిల్లీ:
అణు యుద్ధం, కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగం వల్ల మానవాళి మనుగడ భవిష్యత్తులో ప్రమాదంలో పడొచ్చని లాన్సెట్ కొత్త నివేదిక హెచ్చరించింది. ఈ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ 2100 నాటికి వాటి వల్ల మానవాళి తుడిచి పెట్టుకుపోయే అవకాశం ఉందని తెలిపింది. మనుషుల ఆరోగ్యానికి రానున్న 75 ఏండ్లలో ప్రమాదకరంగా మారే 17 అంశాలను నివేదిక పేర్కొంది. వాటిలో ప్రధానంగా అణు యుద్ధం, ఏఐ దుర్వినియోగం, వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, పిల్లల్లో పోషకాహార లోపం, ఊబకాయం, అంతర్జాతీయ సహాయంలో కోత వంటివి ఉన్నాయి.'ఆరోగ్యానికి 21వ శతాబ్దపు ప్రపంచ ప్రమాదాలపై లాన్సెట్ కమిషన్' పేరిట విడుదలైన నివేదికలో ఈ సమస్యలన్నీ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నాయని..ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకొని భవిష్యత్తు తరాలను రక్షించవచ్చని నిపుణులు తెలిపారు. జీవాయుధాల సృష్టికి ఏఐని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నదని.. ఈ ఆయుధాలు లక్షలాది మంది జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని వారు హెచ్చరించారు. అణు యుద్ధం వల్ల పెద్ద సంఖ్యలో రేణువులు ఉపరితల వాతావరణంలోకి చేరతాయని..అవి సూర్య కాంతిని అడ్డుకొని ఆహారోత్పత్తిని ప్రభావితం చేస్తాయని తెలిపారు. ఇది కరువుకు దారి తీసి మానవాళి మనుగడకు ప్రమాదకరంగా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఆల్కహాల్ సేవనం, అధిక రక్తపోటు, ఆదాయ అసమానతలు, తక్కువ విద్యా స్థాయిలు, మానసిక ఆరోగ్య క్షీణత, కూడా మానవాళి ఆరోగ్యానికి సవాళ్లు విసురుతాయన్నారు.

# అట్టుడికిన హస్తిన

**-ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు**
**-జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు**
**రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే**
**-జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు**
**-భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు**
**-నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ**
**-ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు**
**-నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు**
**-సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ**
**-యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్**



**న్యూఢిల్లీ**
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో సీజేపీ నిరసనలు రెండో రోజూ కొనసాగాయి. జాతీయ రాజధానిలో పలుచోట్ల ఆందోళనలు జరగడంతో పోలీసులు, పారామిలిటరీ బలగాలను భారీగా మోహరించారు. నిరసనకారులను నియంత్రించేందుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. గత రెండు రోజులుగా వేలాది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. దాదాపు 24 గంటల నిర్బంధం అనంతరం అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను ఆదివారం ఉదయం విడుదల చేసినట్లు సమాచారం. సీజేపీ నాయకుడు అజింక్య శిండే మాట్లాడుతూ.. తమ డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకుల అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం భావిస్తోందని, అయితే తాము వెనక్కి తగ్గబోమని ప్రకటించారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని అశుతోష్ రాంకా వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆందోళనల సందర్భంగా జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, పలువురు విద్యార్థులను నిర్బంధించినట్లు సమాచారం. పోలీసుల దాడిలో తమ నాయకులు గాయపడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటున్నారని సీజేపీ నాయకులు విమర్శించారు. ఢిల్లీలో అత్యవసర పరిస్థితిని తలపించేలా ఆంక్షలు విధించారని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, నిరసనకారులపై పోలీసుల బలప్రయోగం వంటి అంశాలపైనా సీజేపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. తమ ఫోన్లను హ్యాక్ చేశారని లేదా పనిచేయకుండా చేశారని, సాక్ష్యాలను కావాలనే సృష్టించారనే అనుమానాలు ఉన్నాయని సౌరవ్ దాస్ పేర్కొన్నారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని, యువత శాంతియుతంగా నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరోవైపు, నిరసనకారులు తిరిగి జంతర్‌మంతర్‌కు చేరుకునేందుకు ప్రయత్నిస్తారని అజింక్య శిండే ప్రకటించారు. అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్టులతో ఉద్యమం ఆగిపోతుందని ప్రభుత్వం భావించినా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షురాలు నేహా బోరా కూడా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిరసనలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో మెట్రో, రైలు సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అన్ని మెట్రో స్టేషన్లను ఆదివారం తిరిగి తెరిచినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తెలిపింది. రైలు సేవలపై ఆంక్షలు శనివారం వరకే వర్తిస్తాయని నార్తర్న్ రైల్వే అధికారులు వెల్లడించారు. అయితే ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 30 ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించారు. ఢిల్లీకి పరిమితం కాకుండా ఉద్యమాన్ని ఇతర ప్రాంతాలకూ విస్తరించాలని సీజేపీ నాయకులు భావిస్తున్నారు. ముంబైలోని శివాజీ పార్కులో నిరసన నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. మరోవైపు, ఇండియా కూటమి నేతలు కూడా సోమవారం మరోసారి ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సీజేపీ నాయకులతో సమావేశమయ్యేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమయం కోరినట్లు కథనం పేర్కొంది. యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో కొనసాగుతున్న ఈ నిరసనలు రానున్న రోజుల్లో మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం!



ఖాట్మండు
నేపాల్‌లో మరోసారి ప్రకృతి ప్రకోపం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గోర్ఖా జిల్లాలోని చుమ్నుబ్రి ప్రాంతంలో బుది గండకీ నది ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సంభవించిన ఈ విపత్తు ధాటికి పదుల సంఖ్యలో ఇళ్లు, పలు వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నది. రెండు నెలల క్రితం ఎదురైన వరద విషాదం నుంచి తేరుకోకముందే మరోసారి వరదలు విరుచుకుపడటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. నది ప్రవాహం అనూహ్యంగా పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం 3.66 మీటర్లుగా ఉన్న నీటిమట్టం కేవలం రెండు గంటల్లోనే 8.43 మీటర్లకు చేరింది. ప్రమాద సూచిక అయిన ఐదు మీటర్ల స్థాయిని దాటడంతో వరద తీవ్రత పెరిగింది. ఇసుక, బురదతో కూడిన వరద నీరు వేగంగా ప్రవహిస్తూ ఇళ్లు, వంతెనలను ధ్వంసం చేసింది. జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) ప్రాథమిక సమాచారం ప్రకారం 34 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోగా, జలవిద్యుత్ కేంద్రానికి భారీ నష్టం వాటిల్లింది. శాటిలైట్ చిత్రాలు, ప్రాథమిక సమాచారం ఆధారంగా బుది గండకీ నది ప్రవాహానికి ఏదో విధంగా ఆటంకం ఏర్పడి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో నీరు ఒక్కసారిగా ఉప్పొంగి వరదలకు కారణమై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, అసలు కారణాలను నిర్ధారించేందుకు సాంకేతిక విశ్లేషణ అవసరమని స్పష్టం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. మరోవైపు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యం సహాయక చర్యలను ప్రారంభించింది. అత్యవసర వైద్య బృందాన్ని రాజధాని నుంచి హెలికాప్టర్‌లో తరలించింది. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గత ఆగస్టులో టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన వరదలు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు కథనం పేర్కొంది. ఆ విషాదం నుంచి కోలుకుంటున్న నేపాల్‌లో తాజాగా మరోసారి వరదలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. పర్వత ప్రాంతాల్లో ఆకస్మికంగా పెరుగుతున్న నదీ ప్రవాహాలు, వరద ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

## డోలీ మోతల్లేని గ్రామాలే లక్ష్యం!

(మొదటి తరువాయి)

45 వంతెనల నిర్మాణానికి ఉద్దేశించిన అడవితల్లి బాట 2.0కు శ్రీకారం చుట్టారు. అడవితల్లి బాట మొదటి దశలో 858 గిరిజన ఆవాసాలకు 1,662 కిమీ రహదారుల కోసం రూ.1406 కోట్ల పనులు చేపట్టామని.. ఇప్పటికి 753 ఆవాసాల్లో 1282 కిలోమీటర్ల రహదారులు పూర్తి చేశామని.. మిగిలిన పనులను వచ్చే మార్చి నాటికి పూర్తిచేసేలా ముందుకుపోతున్నామని పవన్ తెలిపారు. 2024లో నేను ఒక్కమాట మీకు చెప్పి కూటమికి నేను అండగా ఉన్నాను. మీరు మమ్మల్ని గెలిపించారు. దానికి ప్రతిఫలమే ఈరోజు అడవితల్లి బాట' అని చెప్పారు. సీఎం చంద్రబాబు అపారమైన అనుభవంతో.. డబ్బులున్నా లేకపోయినా.. ప్రభుత్వాన్ని సమర్థతతో నడుపుతున్నారని.. గిరిజనులు కోరుతున్న అభివృద్ధి పనులు, సెల్‌టవర్లు.. అన్నీ చేయడానికి సంసిద్ధంగా ఉన్నామని.. ఎంతో చేస్తున్నాం కూడా అని తెలిపారు. రాష్ట్రం మొత్తమ్మీద రూ.30 వేల కోట్ల విలువైన జలధార మంచినీటి పనులు చేస్తున్నామని చెప్పారుఅడిగినవన్నీ చేస్తాం.. 2019-24 నడుమ ఇలా మాట్లాడే ధైర్యం వైసీపీ మీకు (గిరిజనులకు) ఇవ్వలేదు. కానీ కూటమి నేతలు మీమాట వింటారు. మీరు అడిగినవన్నీ చేస్తాం.. కానీ చేతిలో మంత్రదండం లేదు కదా.. హూంఫట్ అంటే వచ్చేయడానికి!.. అందుకే కొంచెం సమయం ఇవ్వండి. స్థానిక ఎన్నికల్లో సత్తా చూపించండి. సెల్‌టవర్లు, కనెక్టివిటీ రోడ్లు, పాఠశాలలకు సంబంధించి.. ఇలా ప్రతిదీ ఇస్తాం. మేం పైస్థాయిలో చేస్తే కింది స్థాయిలో ఫలితం రావాలంటే మీరు కూడా అంతే సమర్థంగా పనిచేయాలి. మాకు అధికారంపై వ్యామోహం లేదు, బాధ్యత ఉంది. 2019 నుంచి 2024 వరకూ ఒక్క రోడ్డు వేయకుండా డబ్బులన్నీ శిలాఫలకాలకు, వేసిన రంగులకే కొత్త రంగులు వేసి.. కోర్టు తిడితే ఆ రంగులు తీసేసి.. ఇలా వందల కోట్ల డబ్బులు ఖర్చు పెట్టారు. రూ.100 కోట్లు ఖర్చు చేస్తే రంపచోడవరం వంటి నియోజకవర్గానికి రోడ్లు వచ్చేస్తాయి. కానీ వైసీపీ ఎంతో నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు మేం డబ్బులు కిందకు పంపిస్తున్నాం. మేం డబ్బులు (కమీషన్లు) అడిగే అవసరం లేదు. మీరు బాగుండాలనే చాలా త్రికరణ శుద్ధిగా పనిచేస్తున్నాం. ప్రధాని మోదీ ఇస్తే కేంద్రం నుంచి వచ్చే నిధులు, సీఎం చంద్రబాబు ఇచ్చే నిధులు తీసుకొస్తూ.. ఉన్న అప్పులను తీరుస్తూ కొత్త అప్పులను చేస్తూ.. మధ్యలో ఆదాయం పెంచుకుంటూ ఓ విధంగా జగ్లింగ్ చేస్తున్నాం. మాకు మీ శుభాశీస్సులు, అండదండలు కావాలి. స్థానిక ఎన్నికల్లో మీ సంపూర్ణ సహకారం కూటమికి ఇవ్వాలి. అలా చేస్తే మేం మరింత ధైర్యం అభివృద్ధి చేయగలుగుతాం.
మనసు లోతుల్లోంచి మాట్లాడతారు..
గిరిజన యువత, ఆడపడుచులు కష్టనష్టాలు తెలిసినవాళ్లు. నాలా గుండె లోతుల్లోంచి మాట్లాడతారు. తెలివితేటలు చూపించరు. నేను తెలివితేటలు వాడను. మనసే వాడతాను. దానివల్ల కష్టాలు ఉంటాయి.. అలాగే ఫలితాలు కూడా ఉంటాయి. మీరు అండగా ఉంటే నాకు కొండంత ధైర్యం. అభివృద్ధి ఫలాలను ప్రతి గిరిజన గ్రామానికి చేర్చడమే కూటమి సంకల్పం.

## సిరిసిల్ల జేఎన్‌టీయూ సమస్యలను పరిష్కరించండి!

(మొదటి తరువాయి)

తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో కళాశాల అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాల కొనసాగుతున్న ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగంగా మారకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అంతరాయం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు, ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు

# బీసీల ద్వేషి జగన్!

(మొదటి తరువాయి)



రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే, వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తూ అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. బీసీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరిగే విషయంలో ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అంతిమ విజయం వారిదేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని, వారికి సముచిత స్థానం దక్కేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# రొటేషన్‌లో రిజర్వేషన్ల నిర్ధారణ నేడే!

(మొదటి తరువాయి)

అవుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్, జడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్ల ఖరారును మున్సిపల్, పంచాయతీరాజ్ కమిషనర్లు నిర్ధారిస్తారు. రిజర్వేషన్లను మొదట ఎస్టీలకు కేటాయిస్తారు. అనంతరం ఎస్సీలు, బీసీలు, ఓసీలు, మహిళలకు వరుస క్రమంలో కేటాయిస్తారు. రిజర్వేషన్ల సైకిల్ 2021ఎన్నికల్లో ప్రారంభం కావడంతో ఇప్పుడు చైర్‌పర్సన్లు, మేయర్లకు దాని ఆధారంగా రొటేషన్ విధానం అవలంబిస్తారు. ఉదాహరణకు.. గత ఎన్నికల్లో నెల్లూరు మేయర్ పదవి ఎస్టీ(మహిళ)కి వచ్చింది. ఈ



సారి వేరే కేటగిరీకి కేటాయించాలి. ఎస్టీ జనాభాలో మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ రెండో స్థానంలో ఉండడంతో ఇక్కడ మేయర్ పదవి ఎస్టీలకు రిజర్వు కావచ్చన్న అంచనాలు వేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్ రిజర్వేషన్లపై సైతం ఊహాగానాలు ఎక్కువయ్యాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో వార్డులు, డివిజన్ల విభజన జరగడంతో వాటికి మాత్రం రొటేషన్ ఉండదు. కొత్తగా రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీలకు.. అనంతరం పంచాయతీలకు ఎన్నికలు జరుపుతారు.

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
సోమవారం
12-10-2026



## సంపాదకీయం

# మరో పోరుకు నాంది పలుకుదాం



**దీంతో అభివృద్ధి, సంక్షేమం పర్యవేక్షణలో ఇబ్బందులు ఏర్పడేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో ప్రజల ముంగిట పాలన ఉండాలని నిర్ణయం తీసుకుని పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 10 ఉమ్మడి జిల్లాలను 33 జిల్లాలుగా విభజించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా రూ.3.50 కోట్ల, పరిపాలనా సౌలభ్యంతోపాటు, అభివృద్ధి, సంక్షేమం, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రభుత్వం కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేయడం పరిపాలనా విప్లవం.**

తెలంగాణలో జిల్లాల సంఖ్య పెంచడం ద్వారా అదనంగా కేంద్ర ప్రభుత్వం నుంచి విద్యా సంస్థలు, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు వీలవుతుంది. ప్రజల ముంగిట పాలన ఉంటే పారదర్శక పరిపాలన సాధ్యమవుతుందని విశ్వసించి కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లాల ఏర్పాటు తర్వాత తీసుకున్న మరో గొప్ప నిర్ణయం జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రెండు జోన్‌లను ఏడు జోన్‌లుగా, 2 మల్టీజోన్లుగా విభజించి గతంలో ఉన్న రిజర్వేషన్ పద్ధతిని తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్చారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో ఉన్న 85%, 70%, శాతం రిజర్వేషన్లు 95% శాతం తెలంగాణ ప్రజలకు దక్కేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆమోదం తీసుకురావడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైంది. జిల్లా స్థాయి పోస్టుల్లో జిల్లా యువకులకు దక్కే అవకాశం వచ్చింది. గ్రూప్-1 ఉద్యోగాలు కూడా స్థానికులకు దక్కే అవకాశాలు ఎక్కువగా వచ్చాయి. జిల్లా కేంద్రాల్లో కార్యాలయాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటు వలన ప్రజలకు పరిపాలన అందుబాటులోకి రావడం రాష్ట్ర ఏర్పాటుతోనే సాధ్యమైంది. కొత్తగా 153 మండలాలు, 35 రెవెన్యూ డివిజన్లు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, 4,914 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. పరిపాలన సంస్కరణలు తెలంగాణ సత్వర అభివృద్ధికి గొప్ప చోదకశక్తిగా మారాయి. 'సంపద పెంచుదాం.. ప్రజలకు పంచుదాం' అనే నినాదంతో కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం స్వర్ణయుగాన్ని ఆవిష్కరించింది. 2014లో తలసరి ఆదాయం రూ.1,24,104 నుంచి రూ.3,17,115 లకు పెరిగింది. రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ రూ.5,05,848 నుంచి రూ.12,93,469 కోట్లకు పెరుగడం పరిపాలనా సంస్కరణల ఫలితం. విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి జూన్ 23 వరకు 19,464 మెగావాట్లకు పెరిగింది. తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2,140 యూనిట్లకు పెరిగింది. నిరంతర విద్యుత్తు కోసం రూ.1,37,517 కోట్లు ఖర్చు చేసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, కాకతీయ మిషన్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.68 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 350 లక్షల టన్నులకు పెరిగింది. విద్యారంగంలో 1,022 గురుకులాల ఏర్పాటు, 1,005 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, 85 గురుకుల డిగ్రీ కాలేజీలు, 29 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్ సీట్లు మూడు రెట్లు పెరిగాయి. వైద్య రంగంలో మౌలిక వసతులు కల్పించి బెడ్స్ 17 వేల నుంచి 34 వేలకు, ఐసీయూ 5 నుంచి 80, బస్తీ దవాఖానాలు 500, డయాలసిస్ కేంద్రాలు 3 నుంచి 82 వరకు పెంపుతోపాటు హైదరాబాద్ నలువైపులా టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణ, లాంటి చర్యల వలన ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధితో పాటు సంక్షేమం జోడెద్దుల లాగా పాలన సాగింది. అన్నిరంగాల్లో తెలంగాణ దేశంలోనే రోల్‌మాడల్‌గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డులు ఎక్కువగా దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలువడం గర్వకారణం. ప్రజల సంక్షేమం, పరిపాలన రాష్ట్ర ప్రగతికి మాత్రమే కాదు.. దేశాభివృద్ధిలో భాగంగా భావించి పరిపాలన వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టడం ద్వారా ప్రజలకు ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లా స్థాయి కార్యాలయాలు ప్రజలకు చేరువయ్యాయి. సమస్యలకు సులభంగా పరిష్కారాలు కనుగొనేందుకు వీలుకలిగింది. నగరాలు అభివృద్ధి చెందాయి. శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తమ సర్వీస్ సమస్యల కోసం నిత్యం డీఈవో, కలెక్టర్‌లను కలిసే అవకాశం రావడం, చిన్నతరహా ఉద్యోగులకు స్వంత జిల్లాలో పనిచేసే అవకాశం కలిగింది. జిల్లా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమై పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించింది. జిల్లాల ఏర్పాటు సత్వర అభివృద్ధికి, పారదర్శక పాలనకు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి రావడం పరిపాలనా సౌలభ్యమనే విషయాన్ని ప్రజలు గుర్తించారు. భవిష్యత్తు తరాలకు మేలు చేసేలా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికీ జనం హర్షిస్తున్నారు. జిల్లాలు ఏర్పాటు జరిగి పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చారిత్రక నిర్ణయాన్ని హర్షిస్తూ అన్ని జిల్లాల్లో నేడు, రేపు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపడంతోపాటు, నాటి వికాసాన్ని ప్రజలకు వివరించాలి. స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి, తెలంగాణ పునర్నిర్మాణానికి సారథ్యం వహించి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుందాం. దాదాపు మూడేండ్ల కాంగ్రెస్ దుష్టపాలనను ఎండగట్టి, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందనే ప్రజలకు భరోసా ఇద్దాం.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుడుదాం.

# జజ్జనకరి 'జెన్ జీ' రే!



ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించాలా' ఢిల్లీలో శనివారంనాడు కాక్రోచ్ జనతా పార్టీ జంతర్ మంతర్ దగ్గర జరప తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల మీద సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్య ఇది. కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలో పాల్గొనేందుకు వచ్చేవాళ్ళను ఆపడానికి ఢిల్లీ నగరంలో ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు చూస్తే ఈ దేశ ప్రజల మీద నరేంద్ర మోడీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించినట్టుందని సిజెపి కన్వీనర్ అభిజిత్ దీప్కే వ్యాఖ్యానించారు. 'నా జీవితంలో ఢిల్లీని ఇలా చూడలేదు. ఎమర్జెన్సీ కాలంలో కూడా ఇటువంటి పరిస్థితి లేదు' అని ఢిల్లీకే చెందిన సీనియర్ పాత్రికేయురాలు తవ్లీన్ సింగ్ శనివారం ఒక జాతీయ చానల్లో మాట్లాడుతూ అన్నారు. 57 మెట్రో స్టేషన్లను మూసివేసారు. నిజాముద్దీన్ రైల్వేస్టేషన్, న్యూఢిల్లీ రైల్వేస్టేషన్లకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే పలు రైళ్ళను రద్దు చేసారు. ఢిల్లీ నగరమంతటా 35వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానిలోని పలుప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. 'ఎందుకు ఇంత హడావుడి చేస్తున్నారు, కొద్దిమంది చేసే నిరసనలను నిరోధించడానికి ప్రజలందరినీ ఇబ్బంది పెట్టాలా? ఈగను చంపడానికి సుత్తి ఉపయోగించాలా?' అంటూ సుప్రీంకోర్టు ఈసడించింది. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు.. ముఖ్యంగా ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయి. కొద్దిమాసాల క్రితం ఆయన నిరుద్యోగ యువతను కాక్రోచ్‌లతో పోల్చినందుకే వ్యంగ్య స్పందనగా ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ నేడు కేంద్ర ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా తయారైంది. యువతకు సంబంధించిన విద్య, ఉపాధి అంశాలకు మాత్రమే పరిమితం కాకుండా దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతున్న మౌలిక అంశాల మీద కూడా దృష్టి సారించి కేంద్రాన్ని ముప్పుతిప్పలు పెట్టే బలమైన శక్తిగా మారుతోంది. ఈ వీధి పోరాటాలు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవాళ్ళను ఏం చేస్తాయి? ఇలాంటి వాళ్లను ఎంతమందిని చూడలేదు? వీళ్ళు కూడా హార్దిక్ పటేల్, కన్హయ్య కుమార్‌ల వలె తెరమరుగు అయిపోతారంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నవాళ్ళు లేకపోలేదు. ఇప్పుడు అదే సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల బెంచి ఆందోళనకారులను ఈగలతో పోల్చుతూ వ్యాఖ్యానించడం మళ్ళీ ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి. ఇంకో ఈగల జనతా పార్టీ పుట్టుకొచ్చి కాక్రోచ్‌లకు సంఘీభావంగా నిలబడితే ఢిల్లీ నగరాన్ని మరింత దిగ్బంధం చెయ్యడానికి, తమ కుర్చీలు కాపాడుకోడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఇంకెన్ని అవస్థలు పడాలో. సరే, ఆ విషయం ప్రస్తుతం అలా ఉంచితే, కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఆయన అరెస్ట్, వివాదాస్పద సర్ కార్యక్రమం రద్దు, ఎన్నికల కమిషన్‌లో చీఫ్ కమిషనర్ మీద చట్టపరమైన చర్యలు లేకుండా చేస్తూ జరిగిన 2023నాటి సవరణల రద్దు కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ సాగిస్తున్న ఆందోళనలో భాగంగా శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు ఇచ్చిన పిలుపును భగ్నం చెయ్యడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇంత పట్టుదలకుపోతోంది? సర్ కార్యక్రమంలో భాగంగా 13కోట్ల మంది ఓటు హక్కును తొలగిస్తే వాళ్ళంతా ఎవరో దేశానికి వివరించడానికి ఆ పని చేసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు ముందుకు రావడం లేదు? ప్రసిద్ధ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ సమాచార హక్కు చట్టం కింద పలుమార్లు అడిగినా తమ వద్ద వివరాలు లేవని సాక్షాత్తు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమాధానం చెప్పడం ఏమిటి? ఎన్నికల కమిషన్ చీఫ్ కమిషనర్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ విషయంలో దేశప్రజల సందేహాలు నివృత్తి చేసే పని వదిలేసి పార్లమెంట్ సభ్యుడు రవిశంకర్ ప్రసాద్, బిజెపి మరో నాయకుడు సంహిత్ పాత్ర చేత కాకిలెక్కలు చెప్పించి 'కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఎలక్షన్ కమిషనర్లను రక్షించే పని చెయ్యలేదా? వాళ్ళు చేసిన సహాయానికి బదులు పెద్దపెద్ద పదవులు కట్టబెట్టలేదా?' అంటూ యధావిధిగా ఎదురుదాడి చేసి, పత్రికాగోష్టులనుండి చేతులు దులుపుకుని వెళ్ళిపోవడం హాస్యాస్పదంగా లేదా? కొందరు బిజెపి నాయకులు మరికొంత ముందుకుపోయి ప్రజాస్వామ్యానికి, అరాచకత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా ప్రస్తుత పరిస్థితిని అభివర్ణిస్తూ ప్రజాస్వామ్యహక్కు అయిన ఓటును రక్షించుకోడానికి జెన్ జీ చేస్తున్న పోరాటంపై అరాచకం అనే ముద్ర వేసే విఫలప్రయత్నంలో పడ్డారు. 'చట్టాలు చెయ్యడం అయినా, మార్చడం అయినా పార్లమెంటులో జరగాలి, వీధుల్లో కాదు' అని టివి డిబేట్లలో సుద్దులు చెప్తున్నారు ఇంకొందరు బిజెపి నాయకులు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం, జ్ఞానేశ్ కుమార్ ఇరువురి నిర్లక్ష్య ధోరణిపట్ల ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలలోనే అభ్యంతరాలు ఉన్నట్టు లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ వ్యాఖ్యలు ఒకవైపు నిరూపిస్తుంటే జ్ఞానేశ్ కుమార్ సుగుణాలను ప్రస్తుతిస్తూ ట్వీట్లు పెడుతున్న మరో ఎన్‌డిఎ భాగస్వామి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి చూసి జెన్ జీ ముక్కున వేలేసుకుంటున్నది. పైగా ఈ వ్యవహారంవల్ల ఆందోళన చెందుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మనోధైర్యం కలిగించేందుకు ఆయనకంటే సీనియర్ రాజకీయ నాయకుడైన బాబు హుటాహుటిన ఢిల్లీ వెళ్లి గంటన్నరసేపు ప్రధానమంత్రి నివాసంలో గడిపినట్టు వందిమాగధ తెలుగు మీడియా ప్రతినిధులు శుక్రవారం రోజంతా ఊదరగొట్టడం ఇంకో చిత్రం. ఇంతకూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎందుకు కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన చూసి భయపడుతున్నది? ముంబైలో ఇదే బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎక్కడన్నా హింస జరిగిందా? ఢిల్లీలో జరుగుతుందని ఎందుకు భయపడ్డట్టు? ఇక్కడ కాక్రోచ్ జనతా పార్టీ జంతర్ మంతర్ తొలి ఆందోళననాటి ఘటనలను గుర్తుచేసుకోవాలి. జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు పిలుపు ఇచ్చిన అభిజిత్ దీప్కే విదేశాల నుండి వస్తుంటే ఢిల్లీ విమానాశ్రయంలో ఆయన విమానం దిగీ దిగకముందే సాదరంగా ఎదురేగి నిరసన ప్రదర్శనకు అనుమతి ఇస్తున్న పత్రాన్ని పోలీసులే అందించారు. కొద్ది మాసాల కాలంలోనే అభిజిత్ దీప్కే విచ్ఛిన్నకారుడు అయిపోయాడా? శనివారం ఉదయం అదే అభిజిత్ దీప్కేని ఆయన సహచరులు అశుతోష్ రాంకా, శౌరభ్ దాస్‌లను విమానంలోనే ఎందుకు అరెస్ట్ చేసినట్టు? అసలు, కాక్రోచ్ జనతా పార్టీ కో కన్వీనర్ సౌరభ్ దాస్ శుక్రవారం అన్నట్టు నీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి నిన్నే అనుమతి కోరడం ఏమిటి? ఆయన ఇంకో మాట కూడా అన్నారు.. 'ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు, సంబంధిత అధికార యంత్రాంగానికి అవసరమయిన జాగ్రత్త చర్యలు తీసుకోడానికి సమాచారం మాత్రమే ఇస్తాం' అని. సౌరభ్ దాస్ చెప్పినట్టు నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కు సాధించుకోడానికి ఇంకో పోరాటం చెయ్యాలేమో ఈ దేశ ప్రజలు. సీనియర్ నాయకుడు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను దేశయువత డిమాండ్‌కు తలవొగ్గి రాజీనామా చేయించిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఒక అధికారిని వదులుకోడానికి ఎందుకు ఇంత వెనకాడుతున్నది? రాజీనామాల వల్ల ప్రయోజనం ఏముంది, జ్ఞానేశ్ కుమార్ చేత కూడా రాజీనామా చేయించి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది అని పెదవి విరుస్తున్న మేధావులు కూడా ఉన్నారు. అయితే ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించినంత సులభం కాదు, జ్ఞానేశ్ కుమార్‌తో చేయించడం అన్న విషయం మోడీ ప్రభుత్వం తన చర్యలతో స్పష్టం చేస్తున్నది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అనే తీగ లాగితే డొంకంతా కదులుతుంది. ఇప్పటికే జ్ఞానేశ్ కుమార్‌కు, బిజెపిలోనీ పెద్దలకు మధ్య ఉన్న అవినాభావ సంబంధం మీద బోలెడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులు, సివిల్ సర్వీసు అధికారులతో జ్ఞానేశ్ కుమార్‌కు మద్దతుగా ప్రకటనలు ఇప్పించే పనిలో పడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం చుట్టూ ఏర్పాటుచేసిన అదనపు భద్రత గతంలో ఎన్నడూ లేదు. ప్రజలకు.. పోనీ వారి ప్రతినిధులు అయిన రాజకీయ పక్షాలకు అందుబాటులో ఉండాల్సిన ఎన్నికల కమిషన్ కార్యాలయం 300 మంది పార్లమెంట్ సభ్యులు కలవడానికి వెళితే కూడా అత్యంత దూరంలో నిలిపివేసి నిర్బంధంలోకి తీసుకున్నారు. ఇప్పుడు శనివారంనాటి జంతర్ మంతర్ నిరసన కార్యక్రమం ఆపగలిగామని సంతోషపడిపోతే ప్రయోజనం లేదు. అభిజిత్ దీప్కేను జైలులో పెడితే అజింకే షిండే ముందు నడుస్తాడు. ఇది ప్రజాస్వామ్యం. కేంద్ర ప్రభుత్వం ఈ దేశ యువత కోర్కెను మన్నించక తప్పదు. అది రేపా, మరునాడా అనేది తేలాల్సి ఉందంతే. జ్ఞానేశ్ కుమార్ మీద చర్యలు, 13 కోట్ల ఓట్ల గల్లంతు వ్యవహారంలో స్పష్టత, కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రక్షాళనతోబాటు ఇవిఎంలతో ఎన్నికలు జరిపించే ప్రక్రియకు స్వస్తి చెప్పి ఇతర అనేక అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా పేపర్ బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరిపిస్తే తప్ప భారతదేశంలో ప్రజాస్వామ్యం బ్రతకదు. జెన్ జీ దీని కోసం ఉద్యమం కొనసాగించాలి. శాంతియుతంగా గాంధేయ పద్ధతుల్లో నిరసన తెలపడం అరాచకం కాదు 'సర్'. చట్టాలు పార్లమెంటులోనే చేస్తారు, నిజమే. కానీ, చట్టసభలు తమ బాధ్యతను నిర్వర్తించకపోతే ప్రజలు వీధులకు ఎక్కి గుర్తుచేస్తారు 'సర్'.

# ఆచి తూచి 'రిజర్వ్' అడుగు!




నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకపోవచ్చని అంచనా వేస్తున్నారు. నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపేసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు ఎక్కువగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు. మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచీ 'క్రమానుగత కథన విధానం' దిశగా కదులుతున్నట్లు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగరంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. వీటన్నిటివల్లనూ కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది. స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపార్లు 4 లక్షల కోట్ల రూపాయల పైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కిశారు. మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్లని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి. వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిజంగాంగా రెపో రేటు పెంచడానికి ఏ సెంట్రల్ బ్యాంకునినా అనువైనది. అది నెలచూపు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయడంద్వారా అది సాధ్యమేనని ఎంపేసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!

## గుమ్మనూరు సోదరుల చేతుల మీదుగా ఎస్. ఆర్. ప్యూర్ వెజిటేరియన్ హోటల్ ప్రారంభం




**గుంతకల్లు, అక్టోబరు 11( డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్. ఆర్.హోటల్ యజమాని భరత్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆదివారం ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, ఆలూరు నియోజకవర్గ బీజేపీ బీఎల్ఓ-1 గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు శ్రీనివాసులు హోటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభమైన హోటల్ నిర్వాహకులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. గుంతకల్లు పట్టణంలో నాణ్యమైన శాఖాహార వంటకాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందడిగా సాగింది.

## గుంతకల్లు నియోజకవర్గ సమన్వయ దళ్ సభ్యునిగా రాయల్ రంగ ఎన్నిక

**గుంతకల్లు: డ్రీమ్ టైమ్స్**




స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి గుంతకల్లు నియోజకవర్గ సమన్వయ దళ్ సభ్యునిగా కసాపురం గ్రామానికి చెందిన రాయల్ రంగ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు, గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయానికి తన వంతు కృషి చేస్తానని రాయల్ రంగ పేర్కొన్నారు.

## బాలా త్రిపుర సుందరి అవతారంలో గ్రామ దేవత దుర్గా దేవి



**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం :**



దేవీ నవరాత్రులలో భాగంగా మొదటి రోజు పాలాత్రిపుర సుందరి దేవిగా గ్రామ దేవత దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు నియోజకవర్గ కేంద్రం, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం నియోజకవర్గ కేంద్రం ఆయన మంత్రాలయంలో గ్రామ దేవత దుర్గా దేవి మాతను అర్చకులు బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.
ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి మఠం లో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామ దేవత మంచాలమ్మను విశేషంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. దుర్గా నవ రాత్రులను పురస్కరించుకొని గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ సత్రంలో ఆర్యవైశ్యులు, రాఘవేంద్ర పురంలో కాలనీ వాసులు దుర్గా దేవిని బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో విశేషంగా అలంకరించి నైవేద్యం సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## రాక్‌టౌన్ కాలనీలో కన్నుల పండువగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు!

**, నాగోలు :డ్రీమ్ టైమ్స్**



జి ఎస్ ఐ డివిజన్ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీలో తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంప్రదాయాన్ని సమున్నతంగా చాటారు. తెలంగాణ బతుకమ్మ పండుగ తొలి రోజు వేడుకల్లో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. కాలనీ ప్రాంగణంలో గౌరమ్మను కొలువుదీర్చి, బతుకమ్మ పాటలతో సామూహికంగా చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో నృత్యాలు చేశారు. ఈ వేడుకలను కాలనీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి మరియు సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ ద్వారా కాలనీలో ఐక్యత, సఖ్యత వెల్లివిరిశాయని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించేలా ఈ కార్యక్రమం అద్భుతంగా సాగింది.

# జవహర్ నవోదయ విద్యాలయంలో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం

**పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు -- మందుల పంపిణీ**



**ఎమ్మిగనూరు :డ్రీమ్ టైమ్స్**
కర్నూలు జిల్లా బనవాసిలోని PM SHRI జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు, వైద్య నిపుణులు పాల్గొని విద్యాలయంలోని సుమారు 560 మంది విద్యార్థులతో పాటు విద్యాలయ సిబ్బంది మరియు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బాబుల్ రెడ్డి, డాక్టర్ సాయి వాణి, డాక్టర్ శిరీష, డాక్టర్ సురేష్, డాక్టర్ సువర్ణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితర వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని ముఖ్యంగా గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ శ్రీ నూరుల్ ఓమర్, ఖూగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విద్య ఉంటేనే మనిషి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని, విద్య ద్వారానే సమాజంలో గౌరవం లభిస్తుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్‌ను మంచికి ఉపయోగించుకుంటే అది ఒక గొప్ప విద్యా సాధనంగా మారుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. తాను చదువుకున్న సమయంలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, ప్రత్యేక కోచింగ్ లేకుండానే ఖూగా సాధించానని విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకుంటే అనేక విషయాలను స్వయంగా నేర్చుకుని, సరైన మార్గదర్శకత్వంతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. అయితే ఇంటర్నెట్‌ను మంచికి, చెడుకు రెండింటికీ ఉపయోగించుకునే అవకాశం ఉన్నందున విద్యార్థులు సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

**ఎమ్మిగనూరు తహసీల్దార్ శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొనాడు**
విద్యాలయ ప్రిన్సిపల్ ఈ. పద్మావతి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ విద్యను అభ్యసించిన విద్యాలయాన్ని మరచిపోకుండా, తాము చదువుకున్న చోటే విద్యార్థులకు వైద్య సేవలను అందించడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావం, మానవతా విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు క్రాంతి నాయుడు, సాగర్ తదితరులు పాల్గొని వైద్య శిబిరం నిర్వహణలో సహకరించారు. పూర్వ విద్యార్థుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్తుల నుంచి మంచి స్పందనను పొందింది. విద్యాలయ తెలుగు ఉపాధ్యాయుడు కె. వెంకటేశ్వర్లు, వెంకటేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ సహకారాన్ని అందించారు. పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తితో నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరం జవహర్ నవోదయ విద్యాలయ సమాజ సేవా కార్యక్రమాల్లో మరో ముఖ్యమైన కార్యక్రమంగా నిలిచింది.

# రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు






**-రహ్‌వీర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 11,2026**
నంద్యాల: జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యువతతో పాటు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ సబ్ డివిజన్ల పోలీస్ అధికారుల సూచనలతో జిల్లాలోని ముఖ్య కూడళ్లు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించడం, కేంద్ర ప్రభుత్వ రహ్‌వీర్ (ఋష్ట్ర-ఎవవతీ) పథకం గురించి విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు సహకరించే అర్హులైన రహ్‌వీర్లకు రూ.25,000 నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా, అవసరమైన అత్యవసర సేవలకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన చిన్నపాటి నిర్లక్ష్యంతోనే ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. విద్యార్థులు తాము రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.
"ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం -- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం -- అమూల్యమైన ప్రాణాలను కాపాడుదాం" అని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మార్కాపురం జిల్లా 'ఎస్పీ'కి ఎమ్మెల్యేల శుభాకాంక్షలు

**-శాలువాతో సత్కరించి పూల మొక్కలు అందజేసిన ప్రజా ప్రతినిధులు**



**మార్కాపురం,జిల్లా బ్యూరో డ్రీమ్ టైమ్స్**
మార్కాపురం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పంకజ్ కుమార్ మీనాను ఆదివారం ఆయన కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ పంకజ్ కుమార్ మీనాకు శాలువా కప్పి సత్కరించి పూల మొక్కలను అందజేశారు. నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లా పోలీసు వ్యవస్థలో ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు

**-5 గురు అరెస్ట్, రూ.24,010/-ల నగదు స్వాధీనం**



**ఒంగోలు,ప్రకాశం,డ్రీమ్ టైమ్స్**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చీమకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రామతీర్థం గ్రామ శివారు తేదీ:11.10.2026న మధ్యాహ్నం సమయంలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య మరియు వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 5 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.24010/- నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113,పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# 'జగన్' కేసుల్లో 'స్పీడ్' పెంచాలంటూ హైకోర్టులో 'ఈడీ' వాదనలు.. విచారణ 13వ తేదీకి వాయిదా

**-జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ వేగవంతం చేయాలన్న ఈడీ**

**-రోజువారీ విచారణ జరిపి కేసులను త్వరగా తేల్చాలని హైకోర్టుకు వినతి**

**-జగన్‌తో పాటు నిందితులు రోజూ కోర్టుకు హాజరు కావాలని అభ్యర్థన**

**-ఇప్పటికే ఉన్న పిటిషన్లతో కలిపి విచారిస్తామన్న హైకోర్టు**

అమరావతి, ఏపీ :డ్రీమ్ టైమ్స్




మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నమోదైన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది.
ఈ కేసులకు సంబంధించి సీబీఐ కోర్టులో రోజువారీ విచారణ జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని, జగన్‌తో పాటు ఇతర నిందితులు విచారణకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని తన పిటిషన్‌లో అభ్యర్థించింది. 2016 నుంచి 2021 మధ్య కాలంలో తాము దాఖలు చేసిన తొమ్మిది అభియోగపత్రాలపై విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని కోరింది.

పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి. శ్యామ్ కోటేశ్వరరావు, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి. నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. న్యాయమూర్తుల బదిలీలు, నిందితులు వరుసగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడం వంటి పరిణామాల వల్ల ఏళ్లుగా విచారణలో ఆశించిన పురోగతి లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక నేరాల తీవ్రతపై సుప్రీంకోర్టు గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

ఈ కేసుల నేపథ్యాన్ని పరిశీలిస్తే..

దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 'క్విడ్-ప్రో-కో' పద్ధతిలో జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్ వంటి కంపెనీల్లోకి పెట్టుబడులు మళ్లాయన్న ఆరోపణలపై 2011లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత ఈ వ్యవహారంలో సీబీఐ 11, ఈడీ 9 చొప్పున ఛార్జిషీట్లు దాఖలు చేశాయి.

ఈడీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం..

ఇదే అంశంపై హరిరామ జోగయ్య దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో పాటు మరికొన్ని సుమోటో పిటిషన్లు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేసింది. ఈ తాజా పిటిషన్‌ను కూడా వాటితో కలిపి విచారిస్తామని పేర్కొంటూ, తదుపరి విచారణను ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది

# చింత చెట్టు కింద కూర్చుని గిరిజనులతో పవన్ కల్యాణ్ మమేకం

**- గిరిజన గూడెంలో చింతచెట్టు కింద కూర్చుని ప్రజలతో మమేకమైన పవన్ కల్యాణ్**

**-రాకోటలో 'మాటా-మంతి'.. గిరిజనుల సమస్యలకు -అక్కడికక్కడే పరిష్కారాలు**

**-పాఠశాలలు, ఆసుపత్రుల కోసం సుమారు రూ. 5 కోట్ల నిధులు మంజూరు**

**-'అడవి తల్లి బాట 2.0'లో భాగంగా రూ. 2.29 కోట్లతో రహదారికి శంకుస్థాపన**

**-గిరిజనుల సంప్రదాయ స్వాగతం మధ్య పర్యటన సాగించిన ఉప ముఖ్యమంత్రి**



రంపచోడవరం ఏపీ :డ్రీమ్ టైమ్స్



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం గిరిజన గూడెంలో పర్యటించి, అడవి బిడ్డలతో మమేకమయ్యారు. మారుమూల గ్రామానికి స్వయంగా వెళ్లి, చింతచెట్టు కింద రచ్చబండపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేసి గిరిపుత్రుల్లో భరోసా నింపారు.

**చింతచెట్టు కింద రచ్చబండపై కూర్చుని.. 'మాటా-మంతి'**

పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గిరిశిఖర గ్రామంలో 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమానికి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపే 3.4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.29 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఏర్పాటు చేసిన 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ విద్య, వైద్య, మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

**ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కల్యాణ్,**

ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కల్యాణ్, శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, గ్రామ ఆరోగ్య కేంద్రానికి రూ. 15 లక్షలు, హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి వివిధ పథకాల కింద సుమారు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

**పవన్ కల్యాణ్‌కు గిరిజన మహిళల స్వాగతం**

అంతకుముందు గ్రామానికి చేరుకున్న పవన్ కల్యాణ్‌కు గిరిజన మహిళలు పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కలిసి, ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి నేరుగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు తీర్చడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు

# పొదిలిలో పారిశుధ్యం గాలికొదిలేసారా ?

**-ప్రతినిత్యం రోడ్డు పైకి బాత్రూం మురుగు నీరు..**

**-రోడ్డుపైనే బాత్రూం గుంట**

**-ప్రజారోగ్యంతో చెలగాటం!**

**-ఫిర్యాదులు చేసినా స్పందించని నగర పంచాయతీ అధికారులు..**

**-స్వయంగా కమీషనర్ వచ్చి పరిశీలించినా చర్యలు మాత్రం సూన్యం**

**-జడ్పి హైస్కూలు ముందున్న పబ్లిక్ రోడ్డుపై మురుగునీటి ప్రవాహం**

**-విద్యార్థులు, స్థానికులకు తప్పని దుర్గంధం**







**పొదిలి,మార్కాపురం, ఏపీ :డ్రీమ్ టైమ్స్**
స్వచ్ఛ భారత్ లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటోందనే ఆరోపణలు పొదిలి నగర పంచాయతీ పరిధిలో వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి పట్టణం లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వీధిలో, జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఓ ఇంటి నుంచి బాత్రూం మురుగు నీరు నేరుగా పబ్లిక్ రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో తద్వారా వచ్చే దుర్గంధం కారణంగా స్థానికులు, విద్యార్థులు మరియు అక్కడే ఉన్న తహసీల్దార్ ఆఫీసు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రోడ్డుపైనే మురుగునీరు.. ఎక్కడ చూసినా దుర్గంధం!..**

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ప్రక్కనే ఉన్న ఆ ఇంటి నుంచి ప్రతి నిత్యం వెలువడుతున్న మురుగునీరు పబ్లిక్ రహదారిపై పారుతుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు, సమీప నివాస గృహాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఎదురుగానే ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు సైతం ఈ పరిస్థితి కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు.

**దోమల బెడద.. అంటు వ్యాధుల భయం!**

మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం, పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడంతో దోమల బెడద పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించకపోతే దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉందని వారు భయపడుతున్నారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమా?.. పరిశీలించినా చర్యలు చేపట్టని మున్సిపల్ కమిషనర్**

బహిరంగ రహదారి పైకి మురుగునీరు వదులుతున్న సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు. జర్నలిస్ట్ డైరీ ప్రతినిధి ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా ఇటీవల ఆయన వచ్చి మురుగు నీరు రోడ్డుపైకి వస్తున్న విషయం పరిశీలించారు.ఆ ఇంట్లో బాత్రూమ్ కింద గుంట తీయకుండా ఇంటిముందు రోడ్డుపైనే మురుగునీటి గుంటను ఆ ఇంటి యజమాని గతంలో నిర్మాణం చేసిన విషయాన్ని పరిశీలించారు.కానీ నేటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా రోగ్యానికి సంబంధించిన సమస్యపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లలోని మురుగునీటి పారుదల వ్యవస్థ నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించి, రోడ్డుపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నగర పంచాయతీ అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

**స్వచ్ఛ భారత్ నినాదాలకే పరిమితమా?**

ఒకవైపు స్వచ్ఛత, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు పట్టణం లోని ప్రధాన రహదారులపై మురుగునీరు ప్రవహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పొదిలి నగర పంచాయతీ అధికారులు స్పందించి, సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి,సదరు ఇంటి యజమాని పై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీటి ప్రవాహాన్ని రోడ్డు పైకి రాకుండా అరికట్టడంతో పాటు పరిసరాలను శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఇలాంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలు...

**- 25 ఏళ్లుగా కంటి వైద్య సేవలు.. ముఖ్య అతిథిగా డాక్టర్ గట్టమనేని బాబు రావు....**



**నాగారం, ఏపీ :డ్రీమ్ టైమ్స్**
లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ -- మీ రిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి 25వ వార్షికోత్సవం (సిల్వర్ జూబ్లీ) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధిలో రాధిక థియేటర్ సమీపంలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పాతికేళ్లుగా ప్రజలకు కంటి వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది హాజరయ్యారు.
ఈ వేడుకలకు లయన్స్ క్లబ్ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ గట్టమనేని బాబు రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ ఏ. అమర్‌నాథ్ రావు, జిల్లా గవర్నర్ లయన్ కల్లెం కృష్ణారెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా లయన్ కే. హరీశ్ రెడ్డి, లయన్ కే. ఇన్నా రెడ్డి, లయన్ మంద సురేశ్ కుమార్, లయన్ గుంటుక శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

**పాతికేళ్లుగా కంటి వైద్య సేవలు...**

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్--మీరిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) అనుబంధ సంస్థగా కంటి వైద్య సేవలందిస్తోంది. కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆసుపత్రి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ లయన్ చింతల రాంచందర్, కార్యదర్శి లయన్ పొలాస రమేశ్, కోశాధికారి లయన్ ఎస్. ఆంజిరెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించడం, భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రాధాన్యాన్ని చాటాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# 40 మందిని కాపాడిన డ్రైవర్ శివ త్యాగం చిరస్మరణీయం.. మంత్రి లోకేశ్ నివాళి

**-గుండెపోటుతో స్టీరింగ్‌పైనే కుప్పకూలిన ఆర్టీసీ డ్రైవర్**

**-ప్రాణాలు పోయేముందు బస్సును ఆపి 40 మందిని కాపాడిన వైనం**

**-డ్రైవర్ శివకు సెల్యూట్ అంటూ నివాళు లర్పించిన లోకేశ్**

**-మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ హామీ**




కాకినాడ,అమరావతి, ఏపీ :డ్రీమ్ టైమ్స్
కాకినాడ జిల్లాలో ఓ ఆర్టీసీ డ్రైవర్ తన ప్రాణాలను పణంగా పెట్టి 40 మంది ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. తీవ్రమైన గుండెపోటు వస్తున్నప్పటికీ, అత్యంత సమయస్ఫూర్తితో బస్సును రోడ్డు పక్కన నిలిపి, స్టీరింగ్‌పైనే తుదిశ్వాస విడిచారు. కర్తవ్య నిర్వహణలో ఆయన చూపిన సాహసం అందరినీ కలిచివేసింది.కాకినాడ ఆర్టీసీ డిపోలో దినసరి వేతన డ్రైవర్‌గా పనిచేస్తున్న జట్ల శివ (శంఖవరం మండలం, కత్తిపూడి గ్రామం), కాకినాడ నుంచి 40 మంది ప్రయాణికులతో విశాఖపట్నం వెళు తున్నారు. తుని సమీపంలోకి రాగానే ఆయనకు ఛాతీలో తీవ్రమైన నొప్పి మొదలైంది. ఆ సమయంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న బస్సును చాకచక్యంగా అదుపు చేసి, రోడ్డు పక్కన సురక్షితంగా నిలిపారు. అనంతరం స్టీరింగ్‌పైనే కుప్పకూలి మరణించారు. ప్రయాణికులు వెంటనే స్పందించి ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు.

**ఎక్స్' వేదికగా స్పందించిన మంత్రి నారా లోకేశ్...**

ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. డ్రైవర్ శివ సాహసాన్ని కొనియాడుతూ ఆయనకు సెల్యూట్ చేశారు. "40 మంది ప్రాణాలను కాపాడిన ఆపద్బాంధవుడు శివ. తన ప్రాణాపాయ స్థితిలోనూ ప్రయాణికుల క్షేమమే పరమావధిగా బస్సును నిలిపిన ఆయన త్యాగం చిరస్మరణీయం" అని లోకేశ్ పేర్కొన్నారు. శివ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు..

# బిజినెస్

## వారం రోజుల్లో భారీగా పెరిగిన బంగారం ధర!

**-పండుగల సీజన్‌లో పసిడి ధరలకు రెక్కలు**
**-24 క్యారెట్ల బంగారంపై రూ.2,240 పెరుగుదల**
**-22 క్యారెట్ల ధర కూడా రూ.2,050 పైకి**
**-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,51,420**
**-కిలో వెండి ధర రూ.2.45 లక్షల వద్ద స్థిరం**
**-రానున్న రోజుల్లోనూ ధరలు పెరిగే అవకాశం**



**హైదరాబాద్:**
పండుగల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత వారం రోజుల్లోనే పసిడి ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులపై భారం పెరుగుతోంది. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,49,180గా ఉండగా, అక్టోబర్ 11 ఆదివారం నాటికి రూ. 1,51,420కు చేరింది. దీంతో వారం రోజుల్లోనే రూ. 2,240 పెరిగింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా అదే బాటలో పెరిగింది. అక్టోబర్ 5న 10 గ్రాముల ధర రూ. 1,36,750గా ఉండగా, ప్రస్తుతం రూ. 1,38,800కు చేరుకుంది. అంటే వారంలో రూ. 2,050 పెరిగింది. పండుగలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఈ పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కిలో వెండి ధర రూ. 2.45 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మళ్లీ రీఛార్జ్ ధరల పెంపు!

**-మరోసారి 12 నుంచి 15 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం**
**-వచ్చే నాలుగైదు నెలల్లో టారిఫ్‌ల పెంపునకు అంచనాలు**
**-జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వినియోగదారులపై ప్రభావం**
**-5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణకు పెరుగుతున్న ఖర్చులు**
**-వినియోగదారుడి నుంచి సగటు ఆదాయం పెంచుకోవడంపై కంపెనీల దృష్టి**
**-సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం**

న్యూఢిల్లీ
దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులకు మరోసారి రీఛార్జ్ ధరల పెంపు ముప్పు పొంచి ఉంది. వచ్చే నాలుగైదు నెలల్లో టెలికాం టారిఫ్‌లు 12 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. మార్కెట్‌లో పోటీ సంస్థల సంఖ్య తగ్గడం, ధరల పెంపునకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు కారణాలుగా పేర్కొంది. అయితే, టెలికాం కంపెనీలు ధరల పెంపుపై అధికారికంగా ప్రకటన చేయలేదు.



జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన టెలికాం సంస్థలు తమ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. 5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.
ఇప్పటికే రీఛార్జ్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మరోసారి ధరలు పెరిగితే అదనపు భారం పడనుంది. నెలవారీ ఖర్చులు పెరగడంతోపాటు, దీర్ఘకాలిక రీఛార్జ్ ప్రణాళికల ఎంపికపైనా వినియోగదారులు ఆలోచించాల్సి రావచ్చు. అయితే, ధరల పెంపు ఎప్పుడు అమల్లోకి వస్తుంది, ఏయే ప్లాన్లపై ఎంతమేర ప్రభావం ఉంటుంది అనే అంశాలపై ఆయా సంస్థల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టత రానుంది.

## ఈ వారం మార్కెట్లకు పరీక్ష!

**-ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం**
**-ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపర్ల దృష్టి**
**-కంపెనీల త్రైమాసిక ఫలితాలతో షేర్లలో కదలికలు**
**-ముడి చమురు ధరలు, రూపాయి విలువ కీలకం**
**-విదేశీ పెట్టుబడిదారుల లావాదేవీల ప్రభావం**

ఆచితూచి పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని నిపుణుల సూచన ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు, ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేయనున్నాయి. దీంతో మదుపర్లు కీలక సూచీల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాల ధోరణి ఆయా పరిణామాలపై ఆధారపడి ఉండనుంది. ఈ వారం కంపెనీల త్రైమాసిక ఫలితాలు కీలకంగా మారనున్నాయి. సంస్థల ఆదాయం, లాభాలు, భవిష్యత్తు వ్యాపార అంచనాలు ఆశాజనకంగా ఉంటే ఆయా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. ఫలితాలు నిరాశపరిస్తే అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. మరోవైపు




ద్రవ్యోల్బణ గణాంకాలు వడ్డీ రేట్లపై అంచనాలను ప్రభావితం చేయనున్నాయి. ఈ వివరాలను బట్టి మదుపర్లు తమ పెట్టుబడి వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో మార్పులు కూడా దేశీయ మార్కెట్లకు కీలకం కానున్నాయి. చమురు ధరలు పెరిగితే దిగుమతి వ్యయం అధికమై దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగవచ్చు. దీనికి తోడు విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు, అమ్మకాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గులు మార్కెట్ దిశను నిర్ణయించడంలో ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు మార్కెట్ పరిణామాలను జాగ్రత్తగా గమనించాలి. కంపెనీల ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్తు అంచనాలను విశ్లేషించిన తర్వాతే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

### టీమిండియాతో వన్డే సిరీస్..
## న్యూజిలాండ్ విధ్వంసక ఓపెనర్లకు పిలుపు..!

స్వదేశంలో భారత జట్టుతో వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ విధ్వంసక ఓపెనర్లను స్క్వాడ్‌లోకి తీసుకుంది. పలువురు ఆటగాళ్లు గాయపడడంతో.. డేంజరస్ ఫిన్ అలెన్ , టిమ్ సీఫర్ట్ లను ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఆదివారం ఉదయం మిచెల్ శాంట్నర్ సారథిగా 14 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. గాయం నుంచి కోలుకున్న చాప్‌మన్, రచిన్ రవీంద్రలకు చోటు దక్కింది. టీమిండియా సవాల్‌కు సిద్ధమవుతున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు స్క్వాడ్‌ను ప్రకటించింది. పలవురు ఆటగాళ్లను గాయాలు వెంటాడుతున్న వేళ తొలి మూడు వన్డేలకు.. చివరి రెండు వన్డేలకు కొన్ని మార్పులతో పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఐదు వన్డేల సిరీస్‌లో.. 4, 5వ మ్యాచ్‌లకు సీనియర్ బ్యాటర్ ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్‌లను తీసుకున్నారు. మూడేళ్ల క్రితం అలెన్ చివరి వన్డే ఆడగా.. సీఫర్ట్ 18 నెలల తర్వాత స్క్వాడ్‌లోకి వచ్చాడు. గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్‌లు స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. డెవాన్ కాన్వే, విల్ యంగ్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్‌తో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్ యూనిట్‌లో జాకబ్ డఫ్ఫీ, కైలీ జేమీసన్, మ్యాట్ హెన్రీ, బ్లెయిర్ టిక్నర్ ఉన్నారు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో భారత్‌పై సెమీస్‌లో ఆడిన ఫెర్గూసన్ పేస్ దళంలో






కీలకం కానున్నాడు.
**న్యూజిలాండ్ స్క్వాడ్(తొలి మూడు వన్డేలకు):** మిచెల్ శాంట్నర్(కెప్టెన్), మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, నాథన్ స్మిత్, విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ హెన్రీ, కైలీ జేమీసన్, టామ్ లాథమ్(వికెట్ కీపర్), బ్లెయిర్ టిక్నర్.
**న్యూజిలాండ్ స్క్వాడ్(4, 5 వన్డేలకు):** మిచెల్ శాంట్నర్(కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, క్రిస్టియన్ క్లార్కేలాకీ ఫెర్గూసన్, మిచ్ హే(వికెట్ కీపర్), నిక్ కెల్లీ, టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ ఫిషర్, బ్లెయిర్ టిక్నర్.
అక్టోబర్ మూడో వారంలో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది భారత జట్టు. అక్టోబర్ 22 నుంచి శ్రేయాస్ అయ్యర్ సేన, కివీస్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఆపై నవంబర్ 4వ నుంచి ఇరుజట్లు ఐదు వన్డేల్లో తలపడతాయి. అనంతరం నవంబర్ 19 నుంచి రెండు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొట్టనుంది.

## రంజీ ట్రోఫీలో జైస్వాల్, రాహుల్‌కు నిరాశ

**-రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ప్రారంభం**
**-తొలి రోజే విఫలమైన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు**
**-పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన జైస్వాల్**
**-కేవలం నాలుగు పరుగులకే ఔటైన కేఎల్ రాహుల్**
**-ముంబై తరఫున బరిలోకి దిగిన జైస్వాల్**
**-కర్ణాటక జట్టు తరఫున ఆడిన రాహుల్**

భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీ అయిన రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నీలో బరిలోకి దిగిన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తొలి రోజే నిరాశపరిచారు. భారీ ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటారని అభిమానులు ఆశించిన ఈ ఇద్దరు స్టార్ క్రికెటర్లు స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. ముంబై జట్టు తరఫున చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో



ఆడిన యశస్వి జైస్వాల్ పరుగుల ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఆరంభంలోనే వికెట్ కోల్పోవడంతో ముంబై జట్టుకు నిరాశ ఎదురైంది. మరోవైపు కర్ణాటక జట్టు తరఫున బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ కేవలం నాలుగు పరుగులకే వికెట్ కోల్పోయాడు. ఇద్దరు కీలక ఆటగాళ్లు ఇలా స్వల్ప స్కోర్లకే వెనుదిరగడం అభిమానులను నిరాశకు గురిచేసింది. రంజీ ట్రోఫీలో రాణించి తమ ఆటతీరును మెరుగుపరుచుకోవాలని భావించిన ఈ ఆటగాళ్లకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. రాబోయే మ్యాచ్‌ల్లో జైస్వాల్, రాహుల్ తిరిగి ఫామ్‌లోకి వచ్చి భారీ స్కోర్లు సాధిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## టెస్టుల్లో తొలి హ్యాట్రిక్.. చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్..!



బంగ్లాదేశ్ క్రికెట్‌లో పేస్ సంచలనంగా మారిన హసన్ మహమూద్ ఈసారి హ్యాట్రిక్‌తో మెరిశాడు. ఆస్ట్రేలియాపై డార్విన్ టెస్టులో చరిత్రాత్మక విజయంలో భాగమైన అతడు అఫ్గనిస్థాన్ తో ఏకైక టెస్టులో వరస బంతుల్లో మూడు వికెట్లతో చెలరేగాడు. తద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన బంగ్లాదేశ్ మొట్టమొదటి పేసర్‌గా అవతరించాడు. మొత్తంగా రెడ్ బాల్ క్రికెట్‌లో తమ దేశం నుంచి ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్‌గా హసన్ గుర్తింపు సాధించాడు. అఫ్గనిస్థాన్‌తో అబుధాబీలో జరుగుతున్న ఏకైక టెస్టులో హసన్ మహమూద్ నిప్పులు చెరిగాడు. పదునైన పేస్‌తో కాబూలీ బ్యాటర్లను ఇరుకున పెట్టిన అతడు 83వ ఓవర్లో హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. మూడో బంతికి ఇస్మత్ అలంను క్లీన్ బౌల్డ్ చేసిన హసన్.. ఆ తర్వాత బంతికి కైస్ అహ్మద్‌ను వెనక్కి పంపాడు. హ్యాట్రిక్ బంతికి జియా ఉర్ రెహ్మాన్‌ను ఎల్బీగా ఔట్ చేసి చరిత్ర లిఖించాడీ స్పీడ్‌స్టర్. తద్వారా టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన బంగ్లా తొలి పేసర్‌గా హసన్ అవతరించాడు. హసన్ కంటే ముందు టెస్టుల్లో మాజీ స్పిన్నర్లు అలోక్ కపాలి, షోహగ్ గజీలు ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్‌పై 2003 ఆగస్టులోకపాలి తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ వరస బంతుల్లో టెయిలెండర్లు షబ్బీర్ అహ్మద్, డానిష్ కనేరియా, ఉమర్ గుల్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత పదేళ్లకు న్యూజిలాండ్‌పై గజీ.. కొరే అండర్సన్, వాల్టింగ్, బ్రేస్‌వెల్‌ను ఔట్ చేయడం ద్వారా హ్యాట్రిక్ నమోదు చేశాడు.

**వన్డేల్లో ఐదుగురు**
అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లను పరిగణిస్తే.. వన్డేల్లో ఐదుగురు బంగ్లా బౌలర్లు హ్యాట్రిక్ వికెట్లతో ఔరా అనిపించారు. షహదాత్ హొసేన్ 2006లో జింబాబ్వేపై, అబ్దుల్ రజాక్ 2010లో జింబాబ్వేపై, రూబెల్ హొసేన్ 2013లో న్యూజిలాండ్‌పై, తైజుల్ ఇస్లాం 2014లో జింబాబ్వేపై, తస్కిన్ అహ్మద్ 2017లో శ్రీలంకపై హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు.

# విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్..

## - 'రణబాలి' డబ్బింగ్ వెర్షన్స్ విడుదల వాయిదా!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెళ్లి తర్వాత ఈ క్రేజీ కాంబో తెరపైకి వస్తుండటం, అటు 'టాక్సీవాలా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాహుల్ సాంకృత్యాన్ -- విజయ్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనుకున్న తేదీ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే, ఓవర్సీస్ మార్కెట్లోని ప్రేక్షకులకు, ముఖ్యంగా నాన్-తెలుగు విజయ్ ఫ్యాన్స్‌కు మేకర్స్ నుంచి నిరాశ కలిగించే అప్‌డేట్ అందింది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 16న విడుదల రోజున విదేశాల్లో కేవలం ఒరిజినల్ తెలుగు వెర్షన్ మాత్రమే ప్రదర్శించబడుతుంది. ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్‌లకు సంబంధించిన కంటెంట్ సిద్ధం చేయడంలో ఏర్పడిన ఆలస్యం కారణంగా, వాటి రిలీజ్‌ను అక్టోబర్ 23కి వాయిదా వేశారు. మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ థియేటర్ చైన్‌లలో ఇప్పటికే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా, కేవలం ప్రీ-సేల్స్ ద్వారానే సినిమా 50 వేల డాలర్ల మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రీమియర్ కలెక్షన్స్ ఏ స్థాయిలో ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అద్భుతమైన బాణీలు అందిస్తున్న ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



గ్లామర్ రూటులో ఐశ్వర్య రాజేష్

# రజనీకాంత్ 'ధర్మన్'పై భారీ అంచనాలు..

## -2027 సంక్రాంతి నుంచి వేసవికి వాయిదా?




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి పెంచుతున్న చిత్రాల్లో 'ధర్మన్' ఒకటి. విభిన్న కథాంశాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడు అశ్విత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న ఈ ప్రాజెక్టులో రామ్ పోతినేని, రాశీ ఖన్నా, సిమ్రాన్, యోగి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అయితే మొదట అనుకున్న విడుదల తేదీ విషయంలో మార్పులు జరిగే అవకాశం ఉందనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.రజనీకాంత్ నటిస్తున్న సినిమాలంటే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. ముఖ్యంగా 'జైలర్' విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్టులపై అభిమానులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' తర్వాత 'ధర్మన్' గురించి వస్తున్న వార్తలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, కథ, విడుదల తేదీ వంటి వివరాలపై అధికారిక ప్రకటనల కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడు అశ్విత్ మారిముత్తు గతంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. వినోదంతో పాటు భిన్నమైన కథనాన్ని అందించే ప్రయత్నం ఆయన సినిమాల్లో కనిపిస్తుంది. అలాంటి దర్శకుడు ఈ భారీ ప్రాజెక్టును ఎలా రూపొందించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రజనీకాంత్ పేరుతో ముడిపడిన ఈ చిత్రం గురించి వస్తున్న అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ఈ సినిమాకు కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నటుడిగా ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. భారీ తారాగణం, అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ విలువలపైనా అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 'ధర్మన్' విడుదల తేదీపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాను మొదట 2027 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు విడుదల ప్రణాళికల్లో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కమల్ హాసన్ తన మరో చిత్రం 'ఇండియన్ 3'ను పండగ సీజన్‌లో విడుదల చేయాలని యోచిస్తున్నారనే వార్తల నేపథ్యంలో 'ధర్మన్'ను 2027 వేసవికి వాయిదా వేయవచ్చని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



# ఏమీ చేయలేకే గతాన్ని తవ్వుతారు!

'మనల్ని విమర్శించడానికి ఏమీ దొరకనప్పుడు మన గతాన్ని వెలికితీస్తారు. చవకబారు ఆరోపణలు చేసి ఏదో సాధించామని సంబరపడిపోతారు. నా విషయంలో అదే జరిగింది. ఎవరితోనైనా ప్రేమగా మాట్లాడినా, చిరునవ్వుతో పలకరించినా లవ్‌ఎఫైర్ అంటూ ప్రచారం చేశారు. నా స్నేహితుల దగ్గరి నుంచి ప్రేమించే వ్యక్తుల వరకూ.. ప్రతి ఒక్కరిని పరిచయం చేయడానికి నేను ఇష్టపడతాను. ఎప్పటికప్పుడు నా సినిమా విశేషాలను పంచుకుంటూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటాను. ఇంత ఓపెన్‌గా ఉంటున్నప్పటికీ నా మీద ఎందుకు పుకార్లు వ్యాప్తి చేస్తారో అర్థం కాదు. కొన్నిసార్లు వారి వినోదం కోసం వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తుంటారు' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ఆమె తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ఇటీవలే ఓటీటీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది.

# తమిళ దర్శకుడితో భారీ అడ్వెంచర్?



వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సిక్' సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం నితీష్ తివారీ 'రామాయణం'లో రావణుడిగా నటిస్తూ యశ్ బిజీగా ఉన్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్నది. ఈ చిత్రానికి సంబంధించిన తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.మరి 'రామాయణ' ఫ్రాంచైజీ తర్వాత యశ్ చేసే సినిమా ఏంటి? ఆయన సోలో హీరోగా ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో ప్రస్తుతం చర్చనీయాంశాలుగా మారాయి. అయితే.. తాజాగా తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ ఇచ్చిన అప్‌డేట్‌తో ఈ చర్చలకు ఫుల్‌స్టాప్ పడ్డట్టయింది. 'ఇండియానా జోన్స్' తరహాలో ఒక భారీ అడ్వెంచర్ కథను ఇటీవలే యశ్‌కు వినిపించానని, యశ్‌కు కూడా ఆ కథ బాగా నచ్చిందని, 'రామాయణ' కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక, ఈ ప్రాజెక్ట్ వర్క్ మొదలవుతుందని మిత్రన్ చెప్పారు. ఇది యశ్ అభిమానులకు నిజంగా శుభవార్తే.

# జూనియర్ సైంటిస్ట్‌గా శర్వానంద్..

## -రామోజీ ఫిల్మ్‌సిటీలో 'జార్జ్ క్రిష్' ఊరమాస్ షూటింగ్!




టాలీవుడ్ హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'జార్జ్ క్రిష్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచేందుకు వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్ర యూనిట్ అత్యంత భారీ సెట్లను నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అక్కడే ఒక అద్భుతమైన షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే హీరో శర్వానంద్‌పై ఒక అదిరిపోయే 'జార్జ్ క్రిష్' టైటిల్ సాంగ్‌ను గ్రాండ్‌గా షూట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శర్వానంద్ చాలా డిఫరెంట్‌గా జూనియర్ సైంటిస్ట్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చుట్టూ నడిచే సన్నివేశాలు, వైట్ల మార్క్ కామెడీ టైమింగ్ సినిమాకే హైలైట్‌గా నిలవనున్నాయి. ఫుల్-లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ఎన్నో హిలేరియస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలాఉంటే, ఈ సినిమాలో శర్వానంద్ సరసన అందాల భామ మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి మధ్య వచ్చే లవ్ ట్రాక్ పూర్తిగా ట్రెండీగా, యూత్‌ను ఆకట్టుకునేలా వైవిధ్యమైన ఫన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంగీత సంచలనం అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ తో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి మరి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831